


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 161 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 15 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :161 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 15 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఏపీ బడ్జెట్ ₹3,32,205 కోట్లు

### అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీ శాసనసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పంతో ఈ బడ్జెట్ ను రూపొందించామని చెప్పారు.

- రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంతో బడ్జెట్ రూపొందించామన్న పయ్యావుల
- రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు
- అమరావతి నిర్మాణానికి రూ. 6 వేల కోట్లు
- విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ 28 వేల కోట్లు
- రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు



2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర బడ్జెట్ ను ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా బడ్జెట్ ను రూపొందించామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ విధానమని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపుకు తీసుకెళుతున్నామని పయ్యావుల చెప్పారు. రాయలసీమ రైతుల కలలను ఈ బడ్జెట్ సాకారం చేస్తుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా యువతకు గుండె నిబ్బరాన్ని ఇస్తుందని చెప్పారు. తొమ్మిది జిల్లాలతో అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.



**శాఖల వారీగా కేటాయింపులు**

| | |
|---|---|
| పాఠశాల విద్యాశాఖ | రూ.32,308 కోట్లు |
| పంచాయతీరాజ్ | రూ.22,942 కోట్లు |
| వ్యవసాయం,అనుబంధ రంగాలు | రూ.13,598 కోట్లు |
| అన్నదాత సుఖీభవ | రూ.6,660 కోట్లు |
| పోలవరం | రూ.6,105 కోట్లు |
| హోంశాఖ | రూ.9,165 కోట్లు |
| మున్సిపల్ శాఖ | రూ.14,539 కోట్లు |
| అమరావతి | రూ.6 వేల కోట్లు |
| విద్యుత్ రంగం | రూ.13,934 కోట్లు |
| రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులు | రూ.13,546 కోట్లు |
| పరిశ్రమలు | రూ.3,161 కోట్లు |
| సర్దుబాటు నిధి | రూ.1,500 కోట్లు |
| వీబీ జీరామ్ జీ | రూ.8365 కోట్లు |
| గృహ నిర్మాణం | రూ.5,451 కోట్లు |
| ఎన్టీఆర్ వైద్యసేవ | రూ.4,000 కోట్లు |
| జల్ జీవన్ | రూ.4,000 కోట్లు |
| స్వచ్ఛ భారత్ మిషన్ | రూ.1,037 కోట్లు |
| విశాఖ ఆర్థిక ప్రాంతం | రూ.28,000 కోట్లు |
| రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ | రూ.30,000 కోట్లు |

**ప్రతి జిల్లాకు ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్**

| | |
|---|---|
| జలవనరుల శాఖ | రూ.18,224 కోట్లు |
| హాస్టళ్లు, గురుకులాలు | రూ.300 కోట్లు |
| స్కాలర్ షిప్పు | రూ.3,836 కోట్లు |
| మధ్యాహ్న భోజన పథకం | రూ.2,161 కోట్లు |
| ఎన్టీఆర్ భరోసా | రూ.27,719 కోట్లు |

## ఉండవల్లిలో ‘ఇల్లే వేదిక‘..

### నేతలతో కలిసి భోజనం చేసిన నారా లోకేశ్...



- ఉండవల్లిలో ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం
- గుంటూరు, విజయవాడ నేతలతో ఆత్మీయ కలయిక కార్యక్రమం
- సమస్యల పరిష్కారంపై నేతలకు నివేదిక అందజేత
- హాజరైన మహిళలకు మంగళగిరి చేనేత చీరల బహూకరణ

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న ‘ఆత్మీయ కలయిక – ఇల్లే వేదిక‘ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని తన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో

- మిగతా 2లో...



## బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

- విజయం అనంతరం తొలి ప్రసంగం చేసిన తారిఖ్ రెహ్మన్
- బంగ్లాదేశ్ ప్రజలకే ఈ విజయం చెందుతుందన్న బీఎన్‌పీ అధినేత
- హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకుందామన్న తారిఖ్ రెహ్మన్

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధా న్యం ఇస్తామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహ్మన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో...



## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

- పుస్తకాల విషయంలో కొత్త నిబంధనపై కేంద్రం చర్చ
- 20 ఏళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధన తేవాలని భావిస్తున్న కేంద్రం
- రిటైర్ అయ్యాక 20 ఏళ్ళ వరకు సున్నిత అంశాలపై పుస్తకాలు రాయకూడదనే నిబంధన

పెన్ పవర్ డెస్క్:మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రచించిన ‘ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ‘ పుస్తకం వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక

- మిగతా 2లో...



## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు చేసిన సీఐడీ

- డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరఫరా చేసే టెండర్లలో అక్రమాలు
- రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు సమాచారం
- విచారణ బాధ్యతలు సిట్ చీఫ్ రాజశేఖర్ బాబుకు అప్పగింత

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో

- మిగతా 2లో...



## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు... అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

- కూటమి బడ్జెట్‌లో నాయకుల పేర్లు తప్ప కేటాయింపులు లేవన్న బొత్స
- మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేసి మోసం చేశారని విమర్శ
- ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర అప్పుల లెక్కలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని వ్యాఖ్య
- ఈ బడ్జెట్ ప్రజల ధైర్యాన్ని, స్థైర్యాన్ని దెబ్బతీసిందని తీవ్ర విమర్శ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆత్మస్తుతి... పరనింద అన్నట్టు

- మిగతా 2లో...

## ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

### అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్



పెన్ పవర్ డెస్క్: ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం జరిగింది. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసుపై ఇప్పటికే ఏసీబీ విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇప్పటికే కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు కూడా గవర్నర్ అనుమతి ఇచ్చారు.

- మిగతా 2లో...

## మున్సిపల్ పోరులో ‘హస్తం’ జోరు

### ప్రజల నమ్మకానికి నిదర్శనమన్న రాహుల్, ఖర్గే!



పెన్ పవర్ డెస్క్:: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు ఇవాళ రాహుల్ ఎక్స్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

- మిగతా 2లో...



## ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితంపై అమికస్ క్యూరీ సంచలన నివేదిక
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కంటిచూపు కోల్పోతున్నారని వెల్లడి
- కుడి కంటి చూపు 15 శాతానికి పడిపోయిందని నివేదికలో స్పష్టీకరణ
- వ్యక్తిగత వైద్యులతో చికిత్సకు అనుమతించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- వైద్య కారణాలతో బెయిల్ కోసం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయన తన కంటిచూపును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని వెల్లడైంది. ఇమ్రాన్ జైలు పరిస్థితులపై

- మిగతా 2లో...

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బడ్జెట్ పై బుగ్గన విమర్శలు

- బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారన్న బుగ్గన
- గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టు ఉందని వ్యాఖ్య
- వైసీపీ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఏపీ శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని

- మిగతా 2లో...

## ఏపీ బడ్జెట్‌పై మాజీ ఆర్థిక మంత్రి యనమల ఏమన్నారంటే...!

- ఏపీ బడ్జెట్ 2026-27పై యనమల రామకృష్ణుడు కామెంట్స్
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్ అని కితాబు
- ఆర్థిక క్రమశిక్షణ, రుణ నియంత్రణకు ప్రాధాన్యం
- పరిశ్రమలు, పెట్టుబడులకు పెద్దపీట వేయడంపై హర్షం
- సామాజిక న్యాయం దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ 2026–27 వార్షిక బడ్జెట్‌పై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రశంసలు కురిపించారు. ఇది ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్ అని అభివర్ణించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించారని అభినందించారు. ఈ సందర్భంగా యనమల స్పందిస్తూ... “బడ్జెట్‌లో

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# తెలుగునేలపై శైవమత వ్యాప్తి

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ.2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ.1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253, 277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హారీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హారీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృధ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440-495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జునునికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్టించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850-895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ.1100-70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళ...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

# ఉండవల్లిలో 'ఇల్లే వేదిక'..

- మొదటి పేజి తరువాయి

ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేతలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పందిస్తూ... అందరూ కలిసి ఒకేచోట భోజనం చేస్తూ, మాట్లాడుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చిన వివిధ సమస్యలపై ఒక నివేదికను వారికి అందించినట్లు వివరించారు. వారు ఇచ్చిన విజ్ఞప్తులలో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు చెప్పారు. ఈ ఆత్మీయ సమావేశానికి వచ్చిన మహిళలకు మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసినట్లు లోకేశ్ తెలిపారు.

గత కొన్ని రోజులుగా మంత్రి లోకేశ్ కూటమిలోని ప్రజాప్రతినిధులతో ఇలాంటి సుహృద్భావ సమావేశాలు నిర్వహిస్తుండటం ద్వారా పార్టీ శ్రేణులతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు చేసిన సీఐడీ

- మొదటి పేజి తరువాయి

సీఐడీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీఎస్బీసీఐ డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసే రవాణా టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై తాజా కేసు నమోదయింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా వ్యవహరించారని కేసు నమోదు చేశారు. రవాణా టెండర్లలో రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలను పాల్పడినట్టు సమాచారం. ఈ కేసు విచారణ బాధ్యతలను సిట్ చీఫ్ ఎస్పీ రాజశేఖర్ బాబుకు అప్పగించారు.

మరోవైపు, లిక్కర్ స్కామ్ లో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్ ను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయంపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ స్కామ్ లో రూ. 3,500 కోట్లకు పైగా అక్రమ లావాదేవీలు జరిగినట్టు సిట్ అధికారులు అంచనా వేశారు. ఈ కేసును ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది. పలువురు వ్యక్తులకు ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని అరెస్ట్ చేశారు. మరో 9 మంది విదేశాల్లో తలదాచుకున్నట్టు సిట్ అధికారులు తెలిపారు.

## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు... అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

- మొదటి పేజి తరువాయి

బడ్జెట్ ప్రసంగం సాగిందని విమర్శించారు. ఇది అంకెల గారడీతో కూడిన పసలేని బడ్జెట్ అని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ పేర్లను పదిసార్లు ప్రస్తావించడం తప్ప ప్రజలకు మేలు చేసే అంశాలు ఏవీ లేవని ఆయన దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ ప్రజల్లో ఉన్న కొద్దిపాటి ధైర్యాన్ని, స్థైర్యాన్ని కూడా దెబ్బతీసిందని, ఇది మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో బొత్స మాట్లాడుతూ, ప్రతి రంగంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు.

మహిళా సాధికారతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతి ఇంట్లో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "గతంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి, వారిలో పారిశ్రామిక స్ఫూర్తిని నింపడానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ పథకాన్ని తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సున్నా వడ్డీని అమలు చేశాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్కరోజు కూడా ఆలస్యం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సున్నా వడ్డీ డబ్బులు జమ అయ్యేవి. కానీ ఈ ప్రభుత్వం వచ్చి 19 నెలలైనా ఆ సున్నా వడ్డీ పథకం ఏమైందో తెలియదు. బడ్జెట్‌లో దానికి కేటాయింపులు లేవు. ఎలాంటి ఆర్థిక చేయూత లేకుండా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎలా మారుస్తారో చంద్రబాబు చెప్పాలి. ఇది మహిళలను మోసం చేయడం కాదా?" అని బొత్స ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం (చీ=జు+రా) నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం కోత పెట్టిందని బొత్స ఆరోపించారు. "గతంలో ఉపాధి హామీ పథకం కింద 100 శాతం నిధులను కేంద్రమే భరించేది. ఇప్పుడు కేంద్రం నిబంధనలు మార్చి మెటీరియల్, లేబర్ కాంపోనెంట్లలో 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పింది. గత ప్రభుత్వాల హయాంలో ఏటా సగటున రూ. 5,000 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసేవారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రం కనీసం రూ. 2,000 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే చూపించారు. మిగిలిన బ్యాలెన్స్ సంగతేంటి? అంటే ఈ పథకాన్ని కూడా నీరుగార్చబోతున్నారా?" అని ఆయన నిలదీశారు.

రాష్ట్ర అప్పుల విషయంలోనూ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని బొత్స ఆరోపించారు. రాష్ట్ర విభజన నుంచి వారసత్వంగా రూ. 9.46 లక్షల కోట్ల అప్పులు వచ్చాయని చెప్పడం సత్యదూరమని అన్నారు. "మా ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్లతో కలిపి మేం చేసిన అప్పు కేవలం రూ. 3 లక్షల కోట్లు మాత్రమే. అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం రూ. 2.30 లక్షల కోట్ల అప్పు చేసింది. వాస్తవాలు ఇలా ఉంటే, అప్పుల భారాన్ని మాపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు" అని బొత్స వివరించారు. ఈ బడ్జెట్‌లో కేవలం ప్రగల్భాలు తప్ప, నిర్దిష్ట కేటాయింపులు, ప్రజలకు భరోసా ఇచ్చే అంశాలు ఏవీ లేవని విమర్శించారు.

# మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

- మొదటి పేజి తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రశంసనీయమైన విజయాన్ని అందించిన అంకితభావం కలిగిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు నా కృతజ్ఞతలు. పీపుల్స్ తెలంగాణ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ పయనిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రజల నమ్మకానికి నిదర్శనం: మల్లికార్జున ఖర్గే**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనం అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు నమ్మకం ఉంచారని, ఆ నమ్మకమే ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందని ఖర్గే పేర్కొన్నారు.

## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

- మొదటి పేజి తరువాయి

నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. మిలిటరీ అధికారులు, అత్యున్నత పదవుల్లోని వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది.ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది పుస్తకాలు రాయడానికి, ప్రచురించడానికి 20 సంవత్సరాల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' మార్గదర్శకాలను ప్రవేశపెట్టడాన్ని కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత ఇరవై సంవత్సరాల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది.

ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చించారని ఆంగ్ల మీడియాలో వార్తలు వచ్చాయి. సీనియర్ సైనిక అధికారులతో సహా ఉన్నత పదవులు నిర్వహించిన వారు సున్నితమైన అంశాలపై పుస్తకాలు రాయడానికి తప్పనిసరి కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధనను తీసుకురావాలని ఎక్కువ మంది మంత్రులు సమర్థించారని తెలుస్తోంది. అయితే ఇది కేబినెట్ అధికారిక అజెండాలో భాగం కాలేదని, సాధారణ చర్చగా సాగిందని పేర్కొన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

- మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టుకు సమర్పించిన అమికస్ క్యూరీ (కోర్టుకు సహాయకుడు) నివేదిక ఈ షాకింగ్ విషయాలను బయటపెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇమ్రాన్ ఆరోగ్యం క్షీణించిందని పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' తన సంపాదకీయంలో తీవ్రంగా విమర్శించింది.కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సల్మాన్ సఫ్దార్, ప్రధాన న్యాయమూర్తి యహ్యా అఫ్రిది నేతృత్వంలోని ధర్మాసనానికి తన నివేదికను సమర్పించారు. గతేడాది అక్టోబర్ 2025 వరకు 6/6గా ఉన్న ఇమ్రాన్ కుడి కంటిచూపు, సరైన వైద్యం అందకపోవడం వల్ల ఇప్పుడు 15 శాతం కంటే తక్కువకు పడిపోయిందని నివేదికలో స్పష్టం చేశారు. కంటి వైద్యుడిని సంప్రదించేందుకు అనుమతించాలని పలుమార్లు కోరినా జైలు సూపరింటెండెంట్ పట్టించుకోలేదని పేర్కొన్నారు.

ఈ నివేదికతో పాకిస్థాన్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. దీనిపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు, ఇమ్రాన్‌కు వ్యక్తిగత వైద్యులతో చికిత్స అందించాలని, విదేశాల్లో ఉన్న తన కుమారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 16వ తేదీలోగా తమ

ఆదేశాలను అమలు చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. రాజకీయ ఖైదీ పట్ల ప్రభుత్వ తీరును 'క్రిమినల్ నిర్లక్ష్యం'గా అభివర్ణించిన ట్రిబ్యూన్ పత్రిక, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఇదిలా ఉండగా, వైద్య కారణాల దృష్ట్యా తోషాఖానా-×× కేసులో తనకు విధించిన శిక్షను నిలిపివేసి, బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ ఇమ్రాన్ ఖాన్ శనివారం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుడి కంటిలో రక్తం గడ్డకట్టడం వల్ల చూపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బడ్జెట్ పై బుగ్గన విమర్శలు

- మొదటి పేజి తరువాయి

విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

## ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

- మొదటి పేజి తరువాయి

ఈ కేసులో రాజకీయ, అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి రావడంతో ఏసీబీ ఛార్జ్‌షీట్‌కు దాఖలు చేసేందుకు సిద్ధమైంది.

రేసు'లో హెచ్ఎమ్‌డీఏ భాగస్వామి కాకపోయినా, దాని ఖాతా నుంచి రూ.54.88 కోట్లు చెల్లించారు. ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే కేటీఆర్ ఇందుకు ఒత్తిడి తెచ్చారని ఏసీబీ నివేదికలో వెల్లడించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు చేయడం మరో అభియోగం. నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఫార్ములా -ఈ కార్ రేసుకు సంబంధించి మూడేళ్లలో 600 కోట్ల రూపాయలు చెల్లించేలా ఒప్పందాలు జరిగినట్టు దర్యాప్తు సంస్థలు తేల్చాయి.

## బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

- మొదటి పేజి తరువాయి

సార్వత్రిక ఎన్నికల్లో విజ యం సాధించిన అనంతరం ఆయన తొలి ప్రసంగం చేశారు. తమ విజయం బంగ్లాదేశ్ ప్రజలకే చెందుతుందని అన్నారు. ఇప్పుడు మనమంతా స్వేచ్ఛను పొందామని, హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకున్నామని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరికీ ఈ విజయన్ని అంకితమిస్తున్నామని అన్నారు. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలే దేశ విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. కాగా, భారత్, చైనా వంటి దేశాలతో సంబంధాలలో సమతుల్యత పాటిస్తామని తారిఖ్ రెహ్మాన్ గతంలో అన్నారు. రెండు దేశాల నిర్ణయాలు, ప్రయోజనాలపై ఆధారపడి భారత్‌తో తమ సంబంధాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

## ఏపీ బడ్జెట్‌పై మాజీ ఆర్థిక మంత్రి యనమల ఏమన్నారంటే...!

- మొదటి పేజి తరువాయి

చేసిన కేటాయింపులతో ప్రజా ఆకాంక్షలు నెరవేరతాయని ఆశిస్తున్నాం. ముఖ్యంగా రుణాలను నియంత్రించేలా ఈ బడ్జెట్ ఉంది. రుణాల రీ-షెడ్యూల్, వడ్డీ తగ్గించడం వంటి చర్యల ద్వారా ఆర్థిక శాఖ రాష్ట్రాన్ని అప్పుల నుంచి బయటపడేస్తుందన్న నమ్మకం ఉంది" అని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులు, అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామమని యనమల హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో, సామాజిక న్యాయం దిశగా బడ్జెట్‌ను తీర్చిదిద్దడం అభినందనీయమని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తం మీద ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

### దామోదరం సంజీవయ్య జయంతి

### దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ జగన్ కితాబు

### పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంస



దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

# సంగమేశ్వర ప్రాజెక్టుకు 25 కోట్లు నిధులు కేటాయింపు

**పొన్నలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 14**

మండలంలోని చెన్నుపాడు సమీపంలో ఉన్న శ్రీ పోతుల చెంచయ్య ప్రాజెక్టుకు శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో రూ 25 కోట్లు నిధులు కేటాయించారు. సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తికి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య చొరవతో నిధులు కేటాయించడం ఎంతో సంతోషమని మండలంలోని ప్రజలు హర్షవ వ్యక్తం చేశారు. నిధులు కేటాయించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మండలంలోని ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.



పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## అభివృద్ధికి సంక్షేమానికి పెద్ద పీట వేసిన
# రాష్ట్ర బడ్జెట్ - మాగుంట



**కార్పొరేషన్ పెన్‌పవర్, ఒంగోలు ఫిబ్రవరి 14**

రాష్ట్ర శాసనసభలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, పయ్యావుల కేశవ్ 2026-27 సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెటులో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేశారని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 13,598 కోట్లతో ప్రత్యేక బడ్జెటుతో పాటు మిగతా రంగాలకు కూడా బడ్జెటులో సముచిత స్థానం కల్పించారని, సంకీర్ణ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన అపూర్వమైన తీర్పుకనుగుణంగా బడ్జెటు రూపొందించడం ప్రశంసనీయం. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు, వైద్య-ఆరోగ్యానికి రూ.19,306 కోట్లు, పాఠశాల విద్యకు రూ. 32,308 కోట్లు, ఎస్.సి. లకు రూ.20,644 కోట్లు, ఎస్.టి. లకు రూ. 9,190 కోట్లు, బి.సి. లకు రూ.51,021 కోట్లు, మైనారిటీలకు రూ.6,090 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.22,942 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.14,539 కోట్లు, జలవనరులకు రూ. 18,224 కోట్లు, ఇంధన రంగానికి రూ.13,934 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,556 కోట్లు, పరిశ్రమలకు రూ. 3,161 కోట్లు, గృహనిర్మాణానికి రూ. 6357 కోట్లు, మునిసిపాలిటీలకు, స్త్రీ సంక్షేమానికి రూ. 4,581 కోట్లు, రూ. 14,538 కోట్లు తదితర శాఖలకు కూడా సముచితంగా కేటాయించడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. సాంఘిక సంక్షేమానికి రూ. 11,118 కోట్లు, యన్.టి.ఆర్. పెన్షన్లకు రూ.27,718 కోట్లు, తల్లికి వందనానికి రూ.9,668 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, పోలవరానికి రూ.6,105 కోట్లు, రాజధానికి రూ. 6,000 కోట్లు, దీపం పథకానికి రూ. 2,601 కోట్లు, యన్ టి ఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు, ఉచిత కరెంటు సబ్సిడీకి రూ. 11,000 కోట్లు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రూ.10,699 కోట్లు కేటాయించారని తెలిపారు. విభజన లోటుతో పాటు, గత ప్రభుత్వ అసమర్ధ పాలనతో, బాగా వెనుకబడిన రాష్ట్ర ప్రగతి పునర్నిర్మాణానికి నరేంద్ర మోదీ సహకారంతో పాటుపడుచున్న నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్ధి - సంక్షేమంతో పాటు అన్ని రంగాలకు సముచిత స్థానం కల్పించిన ఆర్థిక శాఖ మంత్రి, పయ్యావుల కేశవ్, ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన వ్యవసాయ శాఖ మంత్రి, కె. అచ్చెన్నాయుడు లకు మాగుంట కృతజ్ఞతలు తెలియజేశారు.

# పోలీసు పహారాలో పాకల బీచ్

## - పాకల బీచ్ ఫెస్టివల్‌కు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

## - ఏర్పాట్లను పరిశీలించి ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

సింగరాయకొండ మండల, పాకల బీచ్ వద్ద నిర్వహిస్తున్న పాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా చర్యలు చేపట్టింది. ఈ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు శనివారం స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఫెస్టివల్ ప్రాంగణమంతా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ నిఘా ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన సూచనలు సంబంధిత అధికారులకు తెలియచేస్తున్నారు. ఫెస్టివల్‌కు అధిక సంఖ్యలో సందర్శకులు రానున్న నేపథ్యంలో బీచ్ ప్రాంతం, ప్రధాన కార్యక్రమ వేదికలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, పరిసర ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను కేటాయించటం జరిగింది. ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక పార్కింగ్ ప్రణాళిక రూపొందించి, అవసరమైన చోట్ల వాహనాల దారి మళ్లింపు చర్యలు అమలు చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. సముద్ర స్నానాల భద్రత దృష్ట్యా నియంత్రిత ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లోనే స్నానాలకు అనుమతి ఇస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో స్పష్టమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు భద్రతా సూచనలు తెలియచేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం ప్రత్యేక రెస్క్యూ ఏర్పాట్లు చేశారు. ఫెస్టివల్‌లో నిర్వహిస్తున్న సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, ప్రత్యేక రైడ్స్, వివిధ ఆహార స్టాళ్లు, అలంకరణల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నందున, పోలీసు శాఖ జారీ చేసిన సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా పరిస్థితులు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారం, సమన్వయంతో పాకల బీచ్ ఫెస్టివల్‌ను సురక్షితంగా, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, తాలూకా సీఐ విజయ కృష్ణ, డీటీసీ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్ర, టంగుటూరు ఎస్సై నాగమలేశ్వరరావు, జరుగుమల్లి ఎస్సైబి. మహేంద్ర, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

# ఎస్సీల అభ్యున్నతికి రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు నిదర్శనం

## - సీఎం చంద్రబాబు నాయుడుకి మంత్రి డా.డోలా కృతజ్ఞతలు

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

బడ్జెట్ లో ఎస్సీల సంక్షేమానికి రూ. 20,644 కోట్ల కేటాయింపు ఎస్సీల అభ్యున్నతి పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ అన్నారు. శనివారం నాడు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో బడ్జెట్ లో ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిన సీఎం చంద్రబాబు నాయుడుకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు రూ.300 కోట్లు కేటాయింపు పేద పిల్లల చదువుల పట్ల సీఎం ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధకు అద్దం పడుతోందని తెలిపారు. గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో ఎస్సి సంక్షేమానికి ఖర్చు చేయడానికి జగన్ కి చేతులు రాలేదని, నాడు నిధులు దారి మళ్ళించి ఎస్సీ సబ్ ప్లాన్ ని సైతం జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైసీపీ పాలనలో ఎస్సి సంక్షేమాన్ని పట్టించుకోకపోగా ఎస్సీలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



**సంగమేశ్వరపురం ప్రాజెక్టుకి బడ్జెట్ లో రూ. 25 కోట్లు కేటాయింపు**

ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం సంగమేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ. 25 కోట్ల కేటాయించటం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... సంగమేశ్వరపురం ప్రాజెక్టుకి బడ్జెట్ లో రూ.25 కోట్లు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు. ఈ ప్రాజెక్టు ద్వారా కొండపి నియోజకవర్గంలోని 10 వేల ఎకరాలకు సాగునీరు, 60 గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. వైసీపీ హయాంలో సంగేమేశ్వరపురం ప్రాజెక్టుని పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో సంగమేశ్వరపురం ప్రాజెక్టుని పూర్తిచేసి కొండపి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచిగా బడ్జెట్

## - ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం - భవిష్యత్ కు ఒక బ్లూ ప్రింట్ గా రాష్ట్ర బడ్జెట్ ఉందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. ఇది కేవలం గణాంకాల పుస్తకం కాదని, అంకెల గారడీ కాదు కోట్లాదిమంది ప్రజల జీవితాలలో మార్పు తీసుకువచ్చే విజన్ డాక్యుమెంట్ అని జనార్దన్ పేర్కొన్నారు. మాటల కోసం కాకుండా ప్రగతి కోసం ఏర్పాటు చేసినదే ఈ బడ్జెట్ అని, రాష్ట్ర భవిష్యత్ కు స్పష్టమైన దశను, దిశను చూపే విధంగా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం , ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెటు ను కూటమి ప్రభుత్వం రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రజల జీవితాలలో నిజమైన మార్పు వచ్చేలా ఈ బడ్జెట్ ఉందని, బడుగు బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా , వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, విద్య, వైద్యం, టూరిజం, పంచాయితీరాజ్, మహిళా సంక్షేమం రంగాలను బలోపేతం చేసే విధంగా ఈ బడ్జెట్ ను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు బడ్జెట్ లో సముచిత ప్రాధాన్యత ఇచ్చిందని, సంక్షేమానికి గత ఏడాది రూ.41,726 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.53,190 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. మొత్తం సంక్షేమానికి రూ.91,527 కోట్లు కేటాయించడం జరిగిందని జనార్దన్ తెలిపారు . సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, సాగునీటి ప్రాజెక్టులకు ఈ ఏడాది బడ్జెట్లో రూ.18,224 కోట్లు కేటాయించడం జరిగిందని, గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4 వేల కోట్లు అధికంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. గత ఏడాది బడ్జెట్లో ఇళ్ల నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.6,357 కోట్లు కేటాయించడం జరిగిందని, కూటమి ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. విజన్ 2047 లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తెలియజేసారు.


# దామోదర సంజీవయ్య జీవితం స్ఫూర్తి దాయకం

## - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాల ని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ప్రజలకు పిలుపు నిచ్చారు. శనివారం దామోదర సంజీవయ్య 105వజయంతి సందర్భంగా కలెక్టరేట్ ఎదురు ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.రాజబాబు, ఒంగోలుపార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దామోదర సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని అన్నారు. దామోదర సంజీవయ్య బాల్యం నుండి అనేక కష్టాలు పడి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. దామోదర సంజీవయ్య చదువు ద్వారానే ఏదైనా సాధించవచ్చునని గ్రహించి చిన్నతనం నుండి సామాన్య జీవితం గడిపి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ కల్పనకుమారి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్.రియాజ్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పువరపు సుచిత్ర, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మణ నాయక్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వ రరావు దళిత సంఘాల ప్రతినిధులు నీలం నాగేంద్రరావు, యాదాల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మహాశివరాత్రి శుభాకాంక్షలు - మాగుంట



కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14

ఈ మహాశివరాత్రి పర్వదినం రోజున ప్రకాశం, మార్కాపురం జిల్లాల ప్రజలు సనాతన -సాంప్రదాయబద్ధమైన ఉపవాస, జాగరణ దీక్షలు, నదీ స్నానాలు, దానధర్మాలతో శివకేశవులను భక్తి శ్రద్ధలతో పూజించి సకల శుభాలు పొందాలని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పొదిలి ఎస్ ఐను కలసిన తెలుగుదేశం నాయకులు



పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14

పొదిలి మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ సూరెడ్డి రాజేష్ ను పలువురు తెలుగుదేశం నాయకులు కలుసుకున్నారు. పొదిలి ఎస్సైగా రాజేష్ ఇటీవలనే బదిలీపై వచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ను శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ ఐ ను కలసిన వారిలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆవులూరి ఎల్లమంద, మాదాల వారి పాలెం సొసైటీ చైర్మన్ వై వెంకటేశ్వర రెడ్డి, ఉప్పలపాడు సొసైటీ చైర్మన్ ఉలవ గోపి తదితరులు ఉన్నారు.

## శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు

### - మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 14



సృష్టిలయకారుడు.. మూలాధారుడు.. ఆది దేవుడిగా.. సర్వజ్ఞనుడుగా భోళా శంకరుడుగా... పరమ శివుడుగా కీర్తింపబడే పరమాత్మయే పరమ శివుడు ఈ శివరాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని.. శివ నామ స్మరణతో పరమేశ్వరుని కొలిస్తే సకల కోరికలు సిద్ధిస్తాయని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రకాశం జిల్లా ప్రజలకు శివరాత్రి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గుండ్ల బ్రహ్మేశ్వరానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక అనుమతులు



గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 14

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఇటీవల అసెంబ్లీలో మంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసి, మహాశివరాత్రి సందర్భంగా గిద్దలూరు మండలం,దిగువమెట్ట పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతం లో ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి భక్తులు వెళ్లేందుకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, అటవీ శాఖ అధికారులు మహాశివరాత్రి పండుగ సందర్భంగా శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఆలయానికి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేశారు. అటవీ శాఖ నిబంధనల మేరకు వాహనాల్లో కూడా ఆలయానికి వెళ్లవచ్చని స్పష్టం చేశారు. అడవిలోని వన్యప్రాణులకు హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంబంధిత వస్తువులు తీసుకువెళ్లరాదని, అటవీ ప్రాంతానికి నష్టం కలిగించే ఏ వస్తువులనూ తీసుకురావద్దని అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలు అటవీ శాఖ నియమ నిబంధనలను పాటిస్తూ గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి దర్శనార్థం వెళ్లవచ్చని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తెలిపారు.

# ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

## ఉచిత మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవ సభలో జేసీ పులి శ్రీనివాసులు

పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 14

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సామాజిక సేవా దృక్పథంతో ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ను నిర్వహించడం ప్రశంసనీయమని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అన్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీశైలం రోడ్ లో భక్తుల సౌకర్యార్థం మెడికల్ క్యాంపు ను డిఎస్పీ డాక్టర్ యు నాగరాజు తో కలిసి జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సందర్భంగా జేసి శ్రీనివాసులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో లక్షల రూపాయలు విలువ చేసే మెడిసిన్స్ ను మూడు రోజుల పాటు నిరంతరం కాలినడక, వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న భక్తులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మార్కాపురం డిఎస్పీ డాక్టర్ యు. నాగరాజు మాట్లాడుతూ శైవ క్షేత్రమైన శ్రీశైలానికి ఈ పండుగ సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు పెద్ద ఎత్తున రాక పోకలు సాగిస్తుంటారని, ఇలాంటి పరిస్థితుల్లో వారికి యుద్ధ ప్రాతిపదికపై మందులను అందజేసి, ఆరోగ్యాలను కాపాడడం గొప్ప విషయమని అన్నారు. అలాగే శ్రీశైలం వెళ్ళే భక్తులు తమ వాహనాలను ట్రాఫిక్ రూల్స్ కు అనుగుణంగా నడపాలని సూచించారు. ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో తమ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను అనేక



సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని, అందులో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. దాదాపుగా రూ 50 లక్షల విలువ చేసే మందులను ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్నామని అన్నారు. లీ ఫార్మా కంపెనీ అధినేత నాగిరెడ్డి జ్ఞాపకార్థం మందులను ఈ క్యాంపు కు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. వెనుక బడిన మార్కాపురం జిల్లాలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ మెడికల్ క్యాంపు కార్యక్రమానికి హాజరైన జేసీ పులి శ్రీనివాసులు, డిఎస్పీ డాక్టర్ యు నాగరాజు లకు ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



శాలువ కప్పి, స్వామి వారి మెమెంటో లను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోక్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు ఎస్ కె మహబూబ్, పి ఏ సీసీ అధ్యక్షులు బట్టు సుధాకర్ రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాస రెడ్డి, త్రిపురాంతకం మండల పార్టీ అధ్యక్షులు సముద్రాల మల్లికార్జున, పార్టీ అధ్యక్షులు బాదం కిషోర్, గిద్దలూరు పట్టణ పార్టీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ కుమార్, మహిళా నాయకురాలు మద్దెల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్య జిల్లా ఎస్పీ ఘన నివాళులు



క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 14

రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కృషి చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన మహనీయుడు దామోదరం సంజీవయ్య అని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలందించిన దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14వ తేదీన కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్దపాడులో జన్మించారని, చిన్ననాటి నుంచే ప్రతిభ కనబరిచిన ఆయన చదువులోనే కాకుండా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ విశేషంగా రాణించారన్నారు. రాష్ట్ర మంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా సేవలు అందించారని కొనియాడారు. చిన్న వయసులోనే ముఖ్యమంత్రి పదవిని పొందిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వితంతువులు, వృద్ధులకు పింఛన్ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టడం, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా ఏసీబీ వ్యవస్థను దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీ లో స్థాపించారన్నారు. వ్యవసాయాధారిత రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని గాజులదిన్నె, వరదరాజులు, పులిచింతల, వంశధార వంటి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల ఆయన చూపిన కృషి నేటి తరానికి ఆదర్శప్రాయమని, ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ ఆసుపత్రుల లూటీ - టెస్టుల పేరుతో దోపిడీ

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ డిమాండ్

కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14

ప్రజల ఆరోగ్యం వ్యాపార వస్తువుగా మారకూడదని, జీవించే హక్కు రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కు అని, దానిని కాలరాసే హక్కు ఎవరికీ లేదని, మెడికల్ మాఫియా కు, బోగస్ మందుల దందాకు ముగింపు పలకాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం సిపిఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో నకిలీ మెడికల్ మాఫియా కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ దేశంలో ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న మెడికల్ మాఫియా దందా విపరీత స్థాయికి చేరుకుందన్నారు. నాణ్యతలేని, నకిలీ, సబ్ స్టాండర్డ్ మందులు విచ్చలవిడిగా మార్కెట్లో చలామణి అవుతున్నాయని అన్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, ప్రజల జీవించే రాజ్యాంగబద్ధ హక్కుపై ప్రత్యక్ష దాడి అని ధ్వజమెత్తారు. ఫార్మా స్యూటికల్ కంపెనీలు అధిక లాభాల కోసం నాణ్యతను తాకట్టు పెడుతున్నారని, కార్పొరేట్ ఆసుపత్రులు అవసరంలేని టెస్టులు, చేస్తారా చికిత్సలు సూచిస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, ల్యాబ్ సెంటర్లు వైద్యులతో అవినీతి కమిషన్ల వ్యవస్థను నెలకొల్పి ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నాయని, డ్రగ్ కంట్రోల్ యంత్రాంగం పర్యవేక్షణలో ఘోర వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోగస్ మందులపై ప్రత్యేక దళాలతో దాడులు నిర్వహించాలని, నాణ్యత లేని మందుల తయారీ దారులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని, కార్పొరేట్ ఆసుపత్రుల బిల్డింగ్ వ్యవస్థ పై




న్యాయమూర్తి ఆధ్వర్యంలో స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని, ల్యాబ్ టెస్ట్ ధరలను ప్రభుత్వ రేట్లు నిర్దేశించాలని, డ్రగ్ ఇన్స్పెక్టర్ల ఖాళీలను వెంటనే భర్తీ చేసి పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని, జీవన రక్షక మందులను ప్రభుత్వం ఆధ్వర్యంలో తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ వైద్య విద్యారంగంలో ప్రైవేటును అనుమతించరాదని, వైద్య కళాశాలలో పి పి పి విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అన్నారు. అద్దె సర్టిఫికెట్లతో నిర్వహిస్తున్న మందుల షాపులను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కే వీరారెడ్డి, నల్లూరి మురళి, ఎం విజయ, నాయకులు యు ప్రకాష్ రావు, ముత్తన అంజయ్య, నూనె మోహన్రావు, కే నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

### టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు



ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 14

ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని టీడీపీ నియోజకవర్గఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గనాయకులతో, అధికారులతో కలిసి ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు తమ వివిధ సమస్యలకోసం ప్రభుత్వకార్యాలయాల చుట్టు, అధికారుల చుట్టు రోజులు, నెలల పడి తిరిగే వారని, అటువంటి పద్ధతులకు స్వస్తి పలికి, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజలు ఇచ్చే దరఖాస్తులు చిత్తూ కాగితాలు కాదని, వారు పడుతున్న సమస్యల కోసం పరిష్కరించాంటూ విన్నవించుకుంటున్నారని, పరిష్కరించే బాధ్యత అధికారులకు ఉందని అన్నారు. ప్రజా దర్బార్ లోవచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో సంప్రదించి పరిష్కరించారు. ఈ కార్యక్రమం లొ మారట?కట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున,నాయకులు శనగ నారాయణరెడ్డి, వేగినాటి శ్రీనివాస్, తోట మహేష్ నాయుడు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం,ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ మస్తాన్ వలి, షేక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## మా గుంటను కలసిన తెలుగుదేశం నాయకులు



పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14

ఒంగోలు పార్లమెంటు సభ్యులు బాగుంట శ్రీనివాసరెడ్డిని మండల తెలుగుదేశం నాయకులు పలువురు కలుసుకున్నారు. శనివారం నాడు ఒంగోలు పట్టణంలోని మా గుంట నివాసగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మా గుంట ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి, తమ శుభాకాంక్షలు తెలియజేశారు. మా గుంట ను కలసిన వారిలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆవులూరి ఎల్లమంద, మాదాల వారి పాలెం, ఉలవపాడు సహకార సంఘాల అధ్యక్షులు వై వెంకటేశ్వర రెడ్డి, ఉలవ గోపి, జిల్లా టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా, తెలుగుదేశం నాయకులు, కాంట్రాక్టర్ తానికొండ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

## పొదిలి జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థుల జిరాక్స్ మిషన్ బహుకరణ



పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కు 1976-1978 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు 30 వేల రూపాయలు విలువ కలిగిన జిరాక్స్ మిషన్ ను బహుకరించారు. కళాశాలకు జిరాక్స్ మిషన్ ను బహుకరించిన పూర్వ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కే వాసుదేవ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం జి మారుతి ప్రసాద్, మేడా చిన సుబ్బారావు, కాటూరి శ్రీరాములు, పి శ్రీధర్, ఎం వెంకటేశ్వరరావు తోపాటు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొదిలి ఎస్ఐను కలసిన ఎంపీపీ వాకా



పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14

పొదిలి మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ సూరెడ్డి రాజేష్ ను మర్రిపూడి మండల పరిషత్ అధ్యక్షులు వాకా వెంకటరెడ్డి కలుసుకున్నారు. పొదిలి ఎస్సైగా రాజేష్ ఇటీవలే బదిలీపై వచ్చారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని ఎంపీపీ వాక వెంకటరెడ్డి శనివారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ రాజేష్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ను శాలువా, పూలదండతో సత్కరించారు. ఎస్ ఐ రాజేష్ ను కలసిన వారిలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి తో పాటు మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి, తెలుగుదేశం మైనార్టీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ షబ్బీర్, ధారా రమేష్, షేక్ ఖాదర్ భాష, బొడ్డు సుబ్బయ్య, వేల్పుల చైతన్య బాబు, ముల్లా రబ్బాని తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు ఇష్టంతో చదివితే విజయం సాధిస్తారు



## విద్యార్థులకు మెడల్స్‌ను అందజేసిన నేతాజీ సుబ్బారెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

ఇష్టంతో చదివితే విజయం సులభం అవుతుందని, విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలను సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని నెల్లూరు నేతాజీ విద్యాసంస్థల అధినేత, అంబవరం జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎంవి (నేతాజీ) సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా గత నెల రోజులుగా నిర్వహించిన పాఠశాల స్థాయి స్పోర్ట్స్ మీట్ పోటీలలో విజేతలకు ఎంవి (నేతాజీ) సుబ్బారెడ్డి సహకారంతో మెడల్స్ సర్టిఫికెట్స్ బహుకరించారు. పూర్వ విద్యార్థి, రిటైర్డ్ విద్యుత్తు లైన్ ఇన్స్పెక్టర్ నేలటూరి వెంకటేశ్వర రెడ్డి పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ కు ఆటోమేటిక్ వాటర్ కంట్రోల్ సిస్టం ను, మరో పూర్వ విద్యార్థి బసివి హనుమంతరావు స్పోర్ట్స్ కిట్ ను అందజేశారు. దాదాపు 20 సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అమోఘమని, విద్యార్థులు శ్రద్ధ గా చదివి మెరుగైన ఫలితాలను పూర్వ విద్యార్థులకు కానుకగా ఇవ్వాలని పొదిలి ఎంఈఓ నాగలక్ష్మి, పాఠశాల హెచ్ఎం షేక్ షరీఫ్ లు అన్నారు. నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో, హెచ్ఎం షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబవరం, ఏ కొత్తపల్లి సర్పంచ్ లు కే కొండయ్య, ముప్పాళ్ళ శ్యామలమ్మ, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి గుంటి మడుగు కృష్ణంరాజు, భైరవకోన మాజీ చైర్మన్ ముప్పాళ్ళ కృష్ణంరాజు, పూర్వ విద్యార్థులు భాస్కర్ రెడ్డి, నేలటూరి వెంకటేశ్వర రెడ్డి, గన్నవరం తిరుపతయ్య, పి కృష్ణమూర్తి, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కొండూరు మునిరాజు, నారాయణ రాజు, వెంకట రాజు, పాఠశాల సిబ్బంది కమ్మనేతి వెంకటేశ్వర్లు,నరేంద్ర బాషా, కరుణాకర్, షరీఫ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

**వలేటివారిపాలెం, పెన్ పవర్, ఫిబ్రవరి 14**



వలేటివారిపాలెం మండల వైసీపీ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు వైసీపీ పార్టీ కుటుంబ సభ్యులకు మండల ప్రజలకు నెల్లూరు జిల్లా వైసీపీ పార్టీ రైతు వింగ్ వైస్ ప్రెసిడెంట్ కట్టా హనుమంతరావు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి మాఘమాస బహుళ చతుర్దశి నాడు జరుపుకునే అతిపెద్ద పండుగ అని, శివపార్వతుల వివాహ దినంగా, పరమశివుడు లింగోద్భవుడైన రాత్రిగా, తాండవం చేసిన రాత్రిగా భావిస్తారని, మహాశివరాత్రి నాడు రాత్రంతా జాగరణ, ఉపవాసం ఉండి శివారాధన చేయడం వల్ల జ్ఞానం, ఆధ్యాత్మిక శక్తి పెరుగుతాయని అన్నారు. పరమశివుడు మరియు పార్వతి వివాహం చేసుకున్న రాత్రి, అలాగే పరమశివుడు పార్వతి దేవిని అర్ధ భాగంలో చేర్చుకున్న రాత్రి మహాశివరాత్రి అని పురాణాలు చెబుతున్నాయని, ఈ రాత్రి ప్రకృతిలో శక్తులు నిశ్చల స్థితిలో ఉంటాయని తెలిపారు . ఆ పరమేశ్వరుడు దీవెనలు మండల ప్రజలపై ఎల్లవేళలా ఉండాలన్నారు.

## బెల్లంకొండ విజయలక్ష్మి కి ఘన సన్మానం

**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14**

భారతీయ జనతా పార్టీ నాయకురాలు, బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత బెల్లంకొండ విజయలక్ష్మి కి ఘన సన్మానం జరిగింది. ప్రస్తుతం జిల్లా బిజెపి అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న విజయలక్ష్మిని బిజెపి అధిష్టానం రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మండల బిజెపి నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. విజయలక్ష్మి నేతృత్వంలో బిజెపి మహిళా మోర్చా ప్రజల్లో మరింత ఆదరణ పొందుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. విజయలక్ష్మిని సత్కరించిన వారిలో మండల బిజెపి అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, జిల్లా మైనారిటీ మోర్చా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష, నాయకులు షేక్ బాషా, పి మురళి, ఎన్ నాగేశ్వరరావు, ఆకుపాటి లక్ష్మణ, డి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్

**– సిపిఐ జిల్లా కార్యదర్శి యం. యల్. నారాయణ**



**కార్పొరేషన్ పెన్ పవర్ ,ఒంగోలు ఫిబ్రవరి 14**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి యం. యల్. నారాయణ పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి, మౌలిక వసతుల కల్పనకు బడ్జట్ లో నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలను దగా చేయడమే అని అన్నారు. మార్కాపురం జిల్లా కు ప్రాణప్రదమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ను 2026జూన్ కు పూర్తి చేస్తాం అని చెప్తూ 490 కోట్లు రూపాయలు మాత్రమే కేటాంచడం పాత అప్పులకే తప్ప ప్రాజెక్టు పూర్తికి కాదని ఇది ముమ్మాటికీ జిల్లా అభివృద్ధిని విస్మరించడమే అని విమర్శించారు. కొత్త పింఛన్లకు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం శోచనీయం అని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టటానికే బడ్జెట్ కేటాయింపులు సరిపోతాయని, వి బి జి రాంజీ కి నిధులు రాష్ట్ర వాటా తగ్గించడం వల్ల పథకం అమలు ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు.

## లికనిగిరి నియోజకవర్గ ప్రజలందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు – దద్దాల

**పామూరు, పెన్ పవర్ ఫిబ్రవరి14**

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు శనివారం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేసారు. శివుని దివ్య శక్తి ప్రజలపై ఉండాలని, పార్వతీ పరమేశ్వరుల దీవెనలతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రజలంతా పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకోవాలన్నారు.



## మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన దారపనేని

**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి14.**



కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ ప్రజలకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతు మహాశివరాత్రి మాఘమాస బహుళ చతుర్దశి నాడు జరుపుకునే అతిపెద్ద పండుగ అని, శివపార్వతుల వివాహ దినంగా, పరమశివుడు లింగోద్భవుడైన రాత్రిగా, తాండవం చేసిన రాత్రిగా భావిస్తారని, మహాశివరాత్రి నాడు రాత్రంతా జాగరణ, ఉపవాసం ఉండి శివారాధన చేయడం వల్ల జ్ఞానం, ఆధ్యాత్మిక శక్తి పెరుగుతాయని, పరమశివుడు మరియు పార్వతి వివాహం చేసుకున్న రాత్రి, అలాగే పరమశివుడు పార్వతి దేవిని అర్ధ భాగంలో చేర్చుకున్న రాత్రి మహాశివరాత్రి అని పురాణాలు చెబుతున్నాయని, ఈ రాత్రి ప్రకృతిలో శక్తులు నిశ్చల స్థితిలో ఉంటాయని, అందుకే వెన్నుముక నిటారుగా ఉంచి ధ్యానం చేయడం వలన ఆధ్యాత్మికంగా ఎంతో మేలు జరుగుతుందని యోగ సంప్రదాయం చెబుతోందని దారపనేని పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామ స్మరణం తో మారుమోగుతాయని, ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలైన మిట్టపాలెం నారాయణస్వామి, భైరవ కోనకు భక్తులు ఆంధ్ర రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వచ్చి దర్శించుకుని శివపార్వతుల కృపకు పాత్రులవుతారని తెలిపారు.

## ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

**నిరసన కార్యక్రమంలో సిపిఐ డిమాండ్**



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం బస్టాండ్ సెంటర్ లో శనివారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు మెడికల్ అండ్ ఫార్మా మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కె.వై పెద్ద మస్తాన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వాల బాధ్యత, రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. మెడికల్, ఫార్మా పరిశ్రమలు మరియు కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజలను అధిక ధరలతో దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశంపై సీపీఐ ఆందోళనలు చేపడుతున్నట్లుతెలిపారు.నాణ్యతలేని జనరిక్ మందులను అధిక ధరలకు విక్రయిస్తున్న ఫార్మా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, అద్దె సర్టిఫికెట్లతో నడుస్తున్న మెడికల్ షాపులను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. ల్యాబ్ పరీక్షల రేట్లను ప్రభుత్వం నిర్ధారించాలని, అవసరమైన మందులను తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలల్లో పెరుగుతున్న అవినీతిని అరికట్టాలని, వైద్య కళాశాలలో రూ.300 కోట్లకు పైగా సైఫండ్ ఎగవేతపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శులు సవరం రమేష్, గువ్వల నరసింహులు, ఎస్ కే వై మౌలాలి, నల్లగట్ల నారాయణ, సవరం రమణయ్య, ఇర్లా అంజయ్య, బి వెంకటేశ్వర్లు, రవణమ్మ, మేకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ఉరి వేసుకుని ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్య

**కొమరోలు మండలం ఎర్రపల్లె గ్రామానికి చెందిన ఎం వెంకట సాయి ఆత్మహత్య**

**వెంకట సాయి కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థి**

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 14**



కొమరోలు మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీలోని ఎర్రపల్లె గ్రామానికి చెందిన మల్లెబోయిన వెంకట సాయి (17) శనివారం తమ ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన జరిగింది. అందిన వివరాల మేరకు కొమరోలు మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీలోని ఎర్రపల్లి గ్రామంలోని బి సి కాలనీకి చెందిన పేద కుటుంబానికి చెందిన మల్లె పోయిన వెంకటేశ్వర్లు రెండవ కుమారుడు వెంకట సాయి కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఇసి గ్రూపులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వెంకట సాయి శనివారం కళాశాలకు హాజరు కాలేదని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ అబ్బూరి అల్లూరయ్య తెలిపారు. కాగా శనివారం తమ ఇంటిలో వెంకట సాయి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఆ గ్రామస్తులు తెలిపారు. దీనితో ఎర్రపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకట సాయి ఆత్మహత్య చేసుకునుటకు గల కారణాలు తెలియవలసి ఉన్నాయి సమాచారం అందుకున్న కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ అబ్బూరి అల్లూరయ్య అధ్యాపకులు పివి నారాయణ ఎర్రబెల్లి గ్రామానికి వెళ్లి మృతుడు వెంకట సాయి మృతదేహంపై పూలమాల వేసిన నివాళులు అర్పించారు. వెంకట సాయి తల్లిదండ్రులను ఓదార్చారు. వెంకట సాయి మృతి పట్ల కొమరోలు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ,వెంకట సాయి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులర్పించారు.కొమరోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెడ్ల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నారాయణస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా దుగ్గిరెడ్డి సుబ్బమ్మ రెడ్డి అన్నదాన సత్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి రోజున మధ్యాహ్నం నుండి రాత్రి జాగారం వరకు భక్తులకు నిరంతరంగా భోజన సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆని కాళ్ళపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సర్పంచ్ చెరుకుపల్లి రాధాకృష్ణా రెడ్డి, కామిరెడ్డి రమణారెడ్డి, సిద్ధమూర్తి మల్లికార్జున రెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణా రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్ర రెడ్డి, దుగ్గిరెడ్డి వెంకట రత్నం, మూరం కృష్ణా రెడ్డి, దుగ్గిరెడ్డి పోతులూర రెడ్డి (డి.పీ.రెడ్డి), దుగ్గిరెడ్డి గోవిందారెడ్డి, పోతులూరయ్య కుమారులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి భక్తులకు భోజన సదుపాయం అందిస్తున్నట్లు తెలిపారు.మహాశివరాత్రి సందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే నేపథ్యంలో సత్రం వద్ద తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## వీధి వ్యాపారుల పై విద్వేషం తగదు



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14**

వీధి వ్యాపారులపై కొందరు మతోన్మాదులు విషం కక్కుతున్నారని, మేడారం జాతరలో వలి అనే చిరు వీధి వ్యాపారి పై జర్నలిజం ముసుగులో వేధింపులకు దిగడం దుర్మార్గమని ఓ పి డి ఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కోవా బన్ వ్యాపారిపై వేధింపులను నిరసిస్తూ శనివారం కలెక్టరేట్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి తీవ్రంగా ఖండించారు. కొంతమంది వ్యక్తులు మత విద్వేషాలను రెచ్చగొడుతూ మీడియా ముసుగులో దాడికి పాల్పడడం చాలా బాధాకరమని, పొట్టకూటి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్న ముస్లిం కులానికి చెందిన చిరు వ్యాపారులపై మత ఉన్మాదులు దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో హిందూ, ముస్లిం సోదరులు అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉన్నారని, వారి మధ్య కొంతమంది రాజకీయ లబ్ధి కోసం మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని అన్నారు.తెలుగు రాష్ట్రలలోని ప్రజలు మత విద్వేషాల పట్ల జాగ్రత్త వహించాలని ప్రజా సంఘ నాయకులు కోరారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి పేరయ్య, రైతు సంఘం నాయకులు సిహెచ్ రంగారావు, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, సిపిఐ నాయకులు ఎం.ఏ.సాలార్, జర్నలిస్టులు బొడ్డు శ్రీనివాసరావు, షేక్ నాసిర్, తెలగతోటి భరత్ కుమార్, బత్తిన యోనా,నరేష్, పలువురు ప్రజా సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కాశీలో మహాశివరాత్రికి భారీ బందోబస్తు

**భక్తులు సహకరించాలని అద్దంకి సి.ఐ సుబ్బరాజు విజ్ఞప్తి**



**అద్దంకి ఆర్సీ ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**

'చిన్న కాశీ'గా ప్రసిద్ధి గాంచిన అద్దంకి మండలంలోని మణికేశ్వరం శివాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఆలయ పరిసరాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అద్దంకి సి.ఐ సుబ్బరాజు వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలో, గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాల్లోనూ పోలీసుల పహారా ఉంటుందని సి.ఐ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా దూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, శాంతిభద్రతల సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు.

**సహకరించాలని విజ్ఞప్తి**

రాత్రి వేళల్లో జాగారం కోసం వచ్చే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు భక్తులు, స్థానికులు పూర్తిస్థాయిలో సహకరించాలని సి.ఐ సుబ్బరాజు కోరారు.

## బడ్జెట్ కేటాయింపులపై యరవ

### సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు



**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 14**

బీసీల అభ్యున్నతి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి చరిత్రలో కనీవినీ ఎరుగని కేటాయింపులు చేశారని కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు ఆనందం వ్యక్తంచేశారు. మూడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్లోనూ నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళుతున్నామన్నారు. నూతన బడ్జెట్ లో ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేశారు. 2026-27 బడ్జెట్ లో రూ.51,021 లక్షల కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు యారవ రమా శ్రీనివాసులు ధన్యవాదాలు తెలియజేశారు.

## అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం



**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 14**

పొదిలిలో జరిగిన ఒక అగ్ని ప్రమాదంలో ఒక గుడిసె పూర్తిగా దగ్ధమైంది. శనివారం నాడు పట్టణ శివారులోని తోట కు చెందిన గురజాల నరేష్ పూరిల్లు అన్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగడంతో కుటుంబ సభ్యులు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. ప్రమాదంలో ఇంట్లో వంట సామాన్లు, బట్టలు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. త్వరలో గుడిసె తొలగించి, రేకులు వేసుకుందామని ఇంట్లో దాచిపెట్టిన 20 వేల రూపాయల నగదు కూడా మంటల్లో కాలిపోయిందని బాధితుడు నరేష్ వాపోయాడు. ప్రభుత్వం పేదవాడైన తనను ఆదుకొని నష్టపరిహారం అందించాలని బాధితుడు నరేష్ కోరాడు.

## యూనియన్ బ్యాంక్ సహకారంతో ఇస్కాన్ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం



**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 14**

మహాశివరాత్రి పండుగ పర్వదినారా పురస్కరించుకొని యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం ఇస్కాన్ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం యూనియన్ బ్రాంచ్ మేనేజర్ తిరుమల శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలం వెళ్లే శివ స్వాములకు భక్తులకు ఉచిత అన్నదానికరం చేపడుతున్నామని వారు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 5000 మంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి నిమయదాస్ అసిస్టెంట్ మేనేజర్ తిలకేశ్వర గౌడ్. బ్యాంకు సిబ్బంది మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే తాటిపర్తి శివరాత్రి శుభాకాంక్షలు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 14**



పరమ పవిత్రమైన మహా శివరాత్రి పండుగ వేల అందరి కోరికలు నెరవేరి, అందరు సుఖ శాంతులతో వర్ధిల్లాలని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జరుపుకుంటున్న మహాశివరాత్రి మాఘ మాస బహుళ చతుర్థశి నాడు జరుపుకునే పెద్ద పండగని, పండుగ రోజు ఉపవాసం చేసి రాత్రంతా జాగరణతో శివానామస్మరణంతో పూజించడం గొప్ప ఫలం అని అన్నారు. శైవ క్షేత్రాలు భక్తితో నిండిపోతాయని, ప్రజలందరి పూజలు ఫలించాలని అందరికి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యుత్ కష్టాలకు చెల్లుచీటి.. గ్రామాల్లో వెలుగుల జిలుగులు

### రూ. 2.79 కోట్లతో పూర్తయిన ఆధునీకరణ పనులు -మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో నెరవేరిన హామీ

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**

బల్లికురవ మండలం, అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ప్రత్యేక చొరవతో సుమారు రూ. 2.79 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన విద్యుత్ ఆధునీకరణ పనులు శరవేగంగా పూర్తయ్యాయి. గత ఏడాది అక్టోబర్‌లో మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ఈ గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో.. గ్రామస్తులు తమ విద్యుత్ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలను సీరియస్ గా తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేశారు. ఈ ఆధునీకరణలో భాగంగా రెండు గ్రామాల్లో కలిపి 860




నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు, లో-వోల్టేజీ సమస్య నివారణకు 8 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను, సాంకేతిక భద్రత కోసం 3 వీసీబీలను అమర్చారు. అలాగే పాత వైర్ల స్థానంలో కొత్త లైన్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గుంటుపల్లి ఫీడర్‌ను రెండు భాగాలుగా విభజించారు. దీనివల్ల




వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందుతుందని అధికారులు తెలిపారు. శనివారం విద్యుత్ శాఖ ఈ.ఈ నల్లూరి మస్తాన్ రావు, స్థానిక నాయకులు ఈ పనులను లాంఛనంగా ప్రారంభించారు. హామీ ఇచ్చిన కొద్ది రోజుల్లోనే సమస్యను పరిష్కరించిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం అవసరం జడ్పీటీసీ టి. రమణమ్మ

### కొరిశపాడులో పోషకాహార ఉత్పత్తుల పంపిణీ



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**

ప్రజలు మెరుగైన ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలంటే నాణ్యమైన ఆహార ఉత్పత్తులు తీసుకోవడం ఎంతో అవసరమని కొరిశపాడు జడ్పీటీసీ సభ్యురాలు టి. రమణమ్మ పేర్కొన్నారు. శనివారం కొరిశపాడు, అంబేద్కర్ నగర్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో డాబర్ సంస్థ సహకారంతో ఆమ్లా (ఉసిరి) ఆధారిత ఆహార ఉత్పత్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రమణమ్మ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడం ప్రతి ఒక్కరికీ ముఖ్యమని తెలిపారు. ఉసిరిలో విటమిన్- సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయని, ఇవి సీజనల్ వ్యాధుల నుండి రక్షణ కల్పించడమే కాకుండా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని ఆమె వివరించారు. డిబిఆర్సి ప్రకాశం జిల్లా కో-ఆర్డినేటర్ దార్ల. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పోషకాహార ఉత్పత్తుల ప్రాముఖ్యతను వివరిస్తూ, సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ కు చెందిన మహిళలు, చిన్నారులు పాల్గొని ఉత్పత్తులను అందుకున్నారు. డిబిఆర్సి ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జీతాల పెంపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపిన 108 సిబ్బంది

**అర్ధవీడు, పెన్ పవర్, ఫిబ్రవరి 14**

ఏపీ 108 అంబులెన్స్ సర్వీస్ లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈ.యం.టి మరియు పైలెట్ లకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం అప్పటికే ఉన్న ఉద్యోగి యొక్క జీతం కు అదనంగా ఉద్యోగికి నెలకు 2000 రూపాయలను పెంచడం తో బాటు, 5సం", 10సం" సర్వీస్ పూర్తి చేసుకొన్న ఉద్యోగులకు ఆటోమేటిక్ స్లాబ్ అప్గ్రేడేషన్ చేయవలెనని నిర్ణయించడం ద్వారా వారికి మరింత ఆర్థిక వెసులుబాటును అందించారు. 108 అంబులెన్స్ ఉద్యోగులకు అందించిన ఆర్థిక పెంపుదలను ఉద్యోగులు అయిన ఈ.యం.టి మరియు పైలెట్లు అందరూ హర్షిస్తున్నారు. ఈ నెల నుండి స్లాబ్ అప్గ్రేడ్ చేసిన జీతాలు చేతికి అందడం తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు అందరూ ఆంధ్రప్రదేశ్ 108 సర్వీస్లో ఏకైక సంఘం అయిన ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్ - 148 సి ఐటియు అనుబంధం) ఉద్యోగ సంఘం ద్వారా " ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు" మరియు " థాంక్యూ భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ " అనే పాంప్లేట్ లను విధులు నిర్వహించే వాహనం ముందు ప్రదర్శిస్తూ వారికి ధన్యవాదాలు తెలియపరుస్తున్నాము.ఈ సందర్భంగా మేము చేస్తున్న విధి నిర్వహణలో మరింత మెరుగైన సేవలు ఆపదలో ఉన్నవారికి అందించి ప్రభుత్వానికి మరియు భవ్య కంపెనీ వారికి మంచి పేరును




తీసుకువస్తామని ఇందుమూలంగా తెలియచేస్తున్నాము. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా అర్ధవీడు 108 అంబులెన్స్ సర్వీసెస్ ఉద్యోగులు శివ బ్రహ్మానందరెడ్డి, భాస్కర్, జిలాని, నాగేంద్ర, ఇలియాస్ పాల్గొన్నారు.

## కందులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ చైర్మన్

### కంభంపాడు సొసైటీ చైర్మన్ వీరప్పనేని చిన్న చెన్నయ్య



**దొనకొండ ఫిబ్రవరి 14 పెన్ పవర్**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అభివృద్ధి చేస్తూ అదేవిధంగా రైతులకు రైతు భరోసా పంటలకు బీమా సౌకర్యం లాంటివి కల్పిస్తూ, రైతు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని ఉద్దేశంతో ప్రభుత్వం తరఫున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.అందులో భాగంగా దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, యువ నాయకులు కడియాల లలిత్ సాగర్ ఆదేశాలతో దొనకొండ మండలం అరవల్లిపాడు గ్రామంలో పడమర కంభంపాడు సొసైటీ చైర్మన్ వీరప్పనేని చిన్న చెన్నయ్య ఆధ్వర్యంలో అరవల్లిపాడు గ్రామ రైతుల సమక్షంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం చేయటం జరిగింది. ఇక్కడ ఎ.పి. మార్క్ ఫెడ్ మరియు నా ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు ధర పై కందులు క్వింటాకు 8000 రూపాయలు కు కందులు కొనుగోలు చేయడం జరుతుందని,తడి 12 శాతం ఉండాలని సొసైటీ సి ఈ వో అల్లూరి వీరబ్రహ్మాచారి తెలిపారు. ఈ కార్యక్రమం లో కంభంపాటి వెంకట నరసయ్య ఎక్స్ ఎంపీటీసీ, పుట్టా ప్రసాద్, వీరపునేని చెన్నకేశవులు, రావి వెంకటేశ్వర్లు, కమ్మ వెంకటేశ్వర్లు, సింగమనేని రమణయ్య, కమ్మ వెంకటస్వామి రైతులు పాల్గొన్నారు.

## పుల్వామా అమరవీరులకు నివాళులు

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14**

2019 సం. ఫిబ్రవరి 14న పాకిస్తాన్ ప్రేరేపిత జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ సభ్యులు చేసిన దాడిలో భారత దేశ సిఆర్పిఎఫ్ జవాన్ల వాహనాలపై ఆత్మహుతి దాడి జరుగుగా 40 మంది జవానులు మరణించారని, 35 మంది జవానులు తీవ్ర గాయాల బారిన పడ్డారని వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్ నాయకులు పేర్కొన్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్ ఆధ్వర్యంలో స్థానిక బండ్లమిట్ట కార్గిల్ స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షులు శిఖాకొల్లి సత్యనారాయణ, జోన్ చైర్మన్ దొరడ్ల శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి సినీగేపల్లి నాగాంజనేయులు, దర్శి మనోహర్ చంద్రశేఖర్, సిహెచ్ సత్యనారాయణ, దొరడ్ల శ్రీనివాసరావు, వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షులు శిఖాకొల్లి సత్యనారాయణ, కార్యదర్శి సినిగేపల్లి



నాగాంజనేయులు కోశాధికారి వలేటి ఠాగూర్, క్లబ్ పూర్వ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, భూమా శ్రీనివాసులు, నేరెళ్ల శ్రీనివాస్ రావు, ధనిశెట్టి రామునాయుడు, రాంబాబు, సీతామహాలక్ష్మి, పొలపల లక్ష్మీ నారాయణ, గుంటూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు

### మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

**సి.ఎస్. పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**



కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికీ కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్సీపీ విశాఖపట్నం పార్లమెంటు పరిశీలకులు కదిరి బాబురావు మహాశివరాత్రి శుభాకాంక్షాలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం ఆధ్యాత్మిక చైతన్యానికి, భక్తి పరవశానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. శివుని దివ్యశక్తి ఆశీస్సులతో పాటు నారాయణస్వామి, భైరవేశ్వర స్వామి, పార్వతీ పరమేశ్వరులు, సంగమేశ్వర స్వామి కృపాకటాక్షాలతో కనిగిరి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## వక్త 2026 సత్తా చాటిన కేటీఆర్ స్కూల్ విద్యార్థులు



**కనిగిరి, పెన్ పవర్, ఫిబ్రవరి 14**

జన విజ్ఞాన వేదిక నిర్వహించిన వక్త 2026 కార్యక్రమంలో కనిగిరి మండల స్థాయిలో 2వ మరియు 3వ స్థానాలలో కేటీఆర్ టెక్నో స్కూల్ విద్యార్థునులు అయిన అశ్విని మరియు భార్గవి లు నిలిచారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ కుందురు తిరుపతి రెడ్డి బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు. కేవలం చదువులోనే కాకుండా ఇటువంటి పోటీలలో కూడా తమ విద్యార్థులు ముందుండడం ఎంతో ఆనందాన్నిచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థులను అన్ని రంగాలలో ముందుకు నడిపించడంలో ఎప్పుడూ కేటీఆర్ స్కూల్ ముందంజలోనే ఉంటుందని స్కూలు ప్రిన్సిపల్ నారాయణ అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

## మండల ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు

**పీసీపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 14**



పీసీ పల్లి మండల వైసీపీ పార్టీ నాయ కులకు, కార్యకర్తలకు , వైసీపీ పార్టీ కుటుంబ సభ్యులకు మండల ప్రజలకు వైసీపీ పార్టీ యువ నాయకులు బద్దెల లక్షణ్ రెడ్డి మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు .శివుని దివ్య శక్తి మండల ప్రజలపై ఉండాలని,పార్వతీ పరమేశ్వరుల దీవెనలతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.అదేవిధంగా మహా శివరాత్రి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకోవాలన్నారు.

# భైరవకోనలో ఘనంగా అంకురార్పణ పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనలోని భైరవేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా అంకురార్పణ పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ మరియు దేవస్థాన సిబ్బంది ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖులు, భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు ఎన్ సి మాలకొండయ్య, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, పోకల మాల్యాద్రి, రష్యా నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే అంకురార్పణ పూజ ఎంతో విశిష్టమైందని తెలిపారు. అంకురార్పణ ద్వారా ఉత్సవాలకు శుభారంభం జరుగుతుందని, భక్తులందరికీ శాంతి, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు మహాశివరాత్రి వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మాలకొండ ఆదాయం రూ. 7,39,386

**వలేటివారిపాలెం,పెన్ పవర్ ఫిబ్రవరి 14**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 7,39,386 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మహా శివరాత్రి శుభాకాంక్షలు

**పీసీపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 14**



ఆదిదేవుడిగా, భోళాశంకరుడిగా, సర్వజ్ఞుడిగా ఆరాధించబడే పరమాత్మయే పరమేశ్వరుడు. ఈ మహా శివరాత్రి పర్వదినాన్ని మండల ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ఆ పరమ శివుని అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ఎంపీటీసీ సభ్యులు చెరుకూరి సతీష్ కుమార్ మండల ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు.

# ముస్లీం ఖభరస్థాన్ అభివృద్ధి చేయాలని ఎరీక్షన్ బాబుకు వినతి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 14**

పట్టణంలో జామియా మజీద్ ఈద్గా లో ఉన్న ముస్లిం ఖబరస్తాన్ లో, సిసి రోడ్డు వేసి అభివృద్ధి చేయాలని ముస్లిం సామాజిక వర్గ ప్రజలు శనివారం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబుకు వినతిపత్రం అందజేశారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలొముస్లీం మత పెద్దలు, నాయకులు ఖబరస్థాన్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి వివరించారు. ఈ సందర్బంగా ముస్లీం మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఈద్గామైదానం వద్ద గల ఖబరస్థాన్ పిచ్చి చెట్లతో నిండిపోయిందని, తామందరు కలిసి బాగుచేసుకున్నామని తెలిపారు. దాదాపు ఆరువెలమంది పైగా ముస్లీం జనాభా ఉందని అందరి చివరి మజిలీ అయిన ఖబరస్థాన్ అభివృద్ధి కి సి సి రోడ్డు వేయాలని, నీటి బోరును ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు మంచి కార్యక్రమానికి ముందుంటానని, త్వరలో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, జనసేన పట్టణ ముస్లిం నాయకులు షేక్ ఇలియాజ్, ముస్లిం మత పెద్దలు మౌలానా హిదాహితుల్లా మౌలానా మహమ్మద్ హుస్సేన్, మౌలానా జుబేర్, సత్తార్ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దుర్గేష్ కు రియాజ్ స్వాగతం

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14**

పాకల బీచ్ ఫెస్టివల్ కు వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ని ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కి పుష్పగుచ్చం అందజేసి సాదర స్వాగతం పలికి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.



# సంజీవయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి:జేసీ శ్రీనివాసులు





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 14**

మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన 105 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయినప్పటికీ పట్టుదలతో చదివి దేశంలోనే మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి అయ్యారని వివరించారు. బడుగు బలహీన వర్గాల కోసం కోసం ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమన్నారు. అదేవిధంగా కాపులకు ప్రత్యేక రిజర్వేషన్ కృషి చేసిన ఘనత కూడా ఆయన దేనని కొనియాడారు. విద్యార్థులుగా భవిష్యత్తును తీర్చిదిద్దు కావాల్సిన బాధ్యతలపై తల్లిదండ్రులపై కాకుండా మీ పైనే ఉందన్నారు. దళితులు అంటే కొన్నిచోట్ల ఇప్పటికి చిన్నచూపు ఉందన్నారు. ప్రభుత్వం కనిపిస్తున్న కల్పిస్తున్న అవకాశాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జిల్లా మలేరియా అధికారి కే. రాహుల్, మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి, పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, సచివాలయ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పామూరు పోలీసుల చర్యలు.

## కనిగిరి మరియు కందుకూరు జంక్షన్ల వద్ద సేఫ్టీ డ్రమ్ములు, కోన్ల ఏర్పాటు.



**ప్రకాశం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కనిగిరి డిఎస్ పి. సాయి ఈశ్వర్ యశ్వంత్ సూచనల మేరకు పామూరు పట్టణ సమీపంలోని 565 జాతీయ రహదారి కనిగిరి మరియు కందుకూరు రోడ్ ప్రధాన కూడళ్ల వద్ద భద్రతను మెరుగుపరిచేందుకు పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. అత్యంత రద్దీగా ఉండే కనిగిరి జంక్షన్ మరియు కందుకూరు జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించడానికి మరియు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి సేఫ్టీ డ్రమ్ములు మరియు ట్రాఫిక్ కోన్లను ఎస్ఐ. కే. అనూక్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ. కే. అనూక్ మాట్లాడుతూ జాతీయ రహదారి 565 జంక్షన్ లవద్ద వాహనాలు అతివేగంగా రావడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ బారికేడ్ల ద్వారా వాహనదారులు అప్రమత్తమై వేగాన్ని తగ్గిస్తారని ఆయన తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రయాణించే వారికి ఈ కోన్లు మార్గదర్శకంగా ఉండి ప్రమాదాలను నివారిస్తాయని ఆయన తెలిపారు. వాహనదారులు పోలీసుల భద్రతా చర్యలకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ఎస్ఐ. కే. అనూక్ వాహన దారులకు విజ్ఞప్తి చేశారు.

# బడ్జెట్ లో మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట

## – 6090 కోట్ల రూపాయలు కేటాయింపు – రాష్ట్ర తెదేపా మైనారిటీ నేత హనీఫ్ ఖాన్ హర్షం

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2026-2027 బడ్జెట్ లో మైనారిటీ సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ 6,090 కోట్ల రూపాయలు కేటాయించడం మైనారిటీ సంక్షేమ పట్ల, వారి అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన మైనారిటీలకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తో అవకాశాలు కల్పించడంతో అన్ని రంగాల్లో మైనారిటీలు ముందుకు వెళ్లారని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి అత్యధిక నిధులు కేటాయించడంలో తోడ్పాటు అందించిన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫారుక్, మైనారిటీ సంక్షేమ శాఖ రాష్ట్ర గౌరవ సలహాదారులు ఎంఎ షరీఫ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు.. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హుస్సేన్ భాష, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షిబ్లి లకు ఈ సందర్భంగా హనీఫ్ ఖాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ మైనార్టీల పట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలకు ముస్లిం సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# సామాజిక సేవలో డాక్టర్ మల్లికార్జున రెడ్డి





**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 14**

వృతి పరంగా వైద్య సేవలు అందిస్తూ ప్రతి శనివారం ప్రజల ఆకలి తీర్చడానికి అన్న వితరణ చేస్తున్న మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎముకలు, కీళ్ళ వ్యాధుల వైద్య నిపుణులు పి. మల్లికార్జునరెడ్డి. రవణమ్మ మెమోరియల్ మల్లికార్జునరెడ్డి మల్టీస్పెషలిటీ హాస్పిటల్, యువసముద్రం ఫౌండేషన్, నెక్స్ జెన్ రోబోటిక్స్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రతి శనివారం మధ్యాహ్నం పాదచారులకు, మండల ప్రజలకు డా. మల్లికార్జున రెడ్డి అన్న వితరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి ఒక్క పూట అన్నం అందితే అదే నాకు లభించే గొప్ప సంతృప్తి అని ఆయన అన్నారు. సమాజంలో ఎవ్వరూ ఆకలితో ఉండకూడదు అనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం అని ప్రతి శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి 3 గంటల వరకు నాణ్యమైన భోజనం అందించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. అన్నదానం కార్యక్రమం ద్వారా మానవత్వాన్ని చాటడమే కాకుండా సమాజంలో సేవాభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ భోజనం అందేలా ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని డాక్టర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు.

# యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

**భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలి నన్నసాని రమేష్**

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు, టిడిపి బూత్ కన్వీనర్ నన్నసాని రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దేవస్థానానికి తరలివస్తారని, వారి సౌకర్యార్థం ఉదయం నుండి రాత్రి వరకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నామని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రత, తాగునీటి సదుపాయం వంటి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. అన్నదానం మహాదానం అనే భావంతో యాదవ సంఘం సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం చేపడుతున్నారని విజయవంతం చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించి విజయవంతం చేయాలని కోరారు.

# మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలించిన చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ బి రమేష్



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను శనివారం చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ బి. రమేష్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశముండటంతో దర్శన వ్యవస్థ, క్యూలైన్లు, తాగునీరు, విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్య ఏర్పాట్లు, భద్రతా చర్యలు తదితర అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాల నిర్వహణపై కూడా ఆరా తీశారు. దేవస్థాన పరిసరాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామి సన్నిధిలో టిడిపి నాయకులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి సన్నిధిలో శనివారం టిడిపి నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, భైరవకోన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు యన్.సి. మాలకొండయ్య, కోనంగి వెంకట కొండయ్య, పోకల మాల్యాద్రి, బొర్రాజు పెద్ద నారాయణ లను ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ మంత్రోచ్ఛరణలతో, గోత్రనామాలతో ఆశీర్వదించి శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం నాయకులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదుపరి ఈవో గిరిరాజు నరసింహ బాబు తో మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లపై క్షమించారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించినట్లు తెలిపారు.





## శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు

**గంగసాని లక్ష్మి, హుస్సేన్ రెడ్డి**



**పామూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

సృష్టిలయకారుడు. మూలాధారుడు. ఆది దేవుడిగా సర్వజ్ఞనుడుగా భోళాశంకరుడుగా పరమశివుడుగా కీర్తింపబడే పరమాత్మయే పరమ శివుడు ఈ శివరాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని శివ నామస్మరణతో పరమేశ్వరుని కొలిస్తే సకల కోరికలు సిద్ధిస్తాయని వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు శివరాత్రి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## వెలుగొండ స్వామికి ప్రత్యేక పూజలు



**కొనకనమిట్ల పెన్ పవర్ ఫిబ్రవరి 14 ;**

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.కొండపై కొలువుదీరిన లక్ష్మమ్మ ఆలయంలో కూడా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## మణికేశ్వరంలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

**క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యాల పర్యవేక్షణ**

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: సీ.ఐ**



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, అద్దంకి మండలం, మణికేశ్వరంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను అద్దంకి సి.ఐ ఏ. సుబ్బరాజు శనివారం పరిశీలించారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకుంటున్న చర్యలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా క్యూ లైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులందరికీ స్వామివారి దర్శనం సజావుగా, ప్రశాంతంగా సాగేలా పోలీసు శాఖ తరపున, ఆలయ కమిటీ తరపున అన్ని చర్యలు తీసుకున్నట్లు సి.ఐ ఈ సందర్భంగా వెల్లడించారు. ?ఈ పరిశీలనలో ఆలయ ఈ.వో వాసు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్. కరిముల్లా, ఆదినారాయణ, బలరామి రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంత్రి దుర్గేష్‌కు రియాజ్ స్వాగతం

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14**

పాకల బీచ్ ఫెస్టివల్ కు వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ని ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కి పుష్పగుచ్చం అందజేసి సాదర స్వాగతం పలికి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.



# ప్రకాశం చరిత్రలో అద్భుతమైన వేడుక ..

### - సాగర తీరంలో సందడి.. -బీచ్ ఫెస్టివల్ ను ప్రారంభించిన ప్రముఖులు

### - ప్రత్యేక ఆకర్షణగా హెలీ టూరిజం, బోట్ రైడింగ్













**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

సింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈనెల 14, 15 తేదీలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో సముద్ర తీరంలో శనివారం సందడి నెలకొంది. హెలీ టూరిజం, స్పీడ్ బోట్ రైడింగ్, ఫుడ్ స్టాల్స్, వివిధ రకాల ఉత్పత్తుల ఎగ్జిబిషన్ స్టాల్స్, శివరాత్రి కళ ఉట్టిపడేలా భారీ సైకత శిల్పాలు రూపొందించి సర్వహంగులతో, సర్వాంగ సుందరంగా చేసిన ఏర్పాట్లను ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర మ్యారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచిత్ర, తదితరులు పాల్గొని ప్రారంభించారు. ఎంపీ, రియాజ్, సత్య, సుచిత్ర, మేయర్ హెలికాప్టర్ లో ప్రయాణించి సందర్శకులలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా, సందర్శకులకు సరికొత్త అనుభూతి కలిగించేలా ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దామచర్ల సత్య మాట్లాడుతూ పాకాల బీచ్ కు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేలా జాతీయ రహదారి నుంచి నేరుగా నాలుగు కిలో మీటర్ల డబల్ లైన్ రోడ్డు వేసేలా ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఉన్న వనరులను సమర్ధంగా వినియోగించుకుంటూ మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ బీచ్ ను అభివృద్ధి చేస్తామన్నారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఆహ్లాదం కోసం ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా స్థానికంగా ఉన్న పాకల బీచ్ ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ టూరిస్ట్ డెస్టినేషన్ గా మార్చాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఈ బీచ్ ను కూడా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఆహ్లాదాన్ని కూడా అందించాలన్నది తమ లక్ష్యం అన్నారు. ఈ దిశగా ప్రత్యేక టూరిజం పాలసీని కూడా ప్రభుత్వం రూపొందించిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ప్రజలపై భారాలు మోపే బడ్జెట్ - సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి




**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 14**

రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలు,అవసరాలు ఏమాత్రం తీర్చేదిగా లేదని ప్రజలపై భారాలు మోపేదిగా రూపొందించినట్లు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి దుయ్యబట్టారు. రాష్ట్ర బడ్జెట్ అంశంపై ఆమె శనివారం సాయంత్రం స్థానిక సుందరయ్య భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది కంటే మరో రూ 10 వేలకోట్లు బడ్జెట్ పెంచి చూపడం మినహా, కూటమి అధికారం చేపట్టి సుమారు 19నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీల అమలుకు అనుగుణంగా బడ్జెట్ లో ప్రస్తావనలు తేకపోవడం విచారకరమన్నారు.కేంద్ర ప్రభుత్వ గ్రాంట్, రాష్ట్ర ఆదాయం, పథకాల అమలు తదితర అంశాలలో స్పష్టత లేదన్నారు. గత ఏడాది బడ్జెట్ కూడా రూపొందించిన విధంగా ఖర్చు చేయలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఎంపిలపై ఆధారపడి పాలన కొనసాగిస్తున్నా, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచడం, తగినన్ని నిధులు రాబట్టుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయినట్లు విమర్శించారు. కేంద్ర గ్రాంట్, ప్రభుత్వ ఆదాయంతో పాటు రెవిన్యూ లోటు పూడ్చుకునేందుకు ప్రజలపై పన్నులు, విద్యుత్ , స్టాంప్ డ్యూటీ వంటి భారాలు మోపడం, అప్పులు తేవడం వంటి చర్యలు చేపడుతున్నట్లు దుయ్యబట్టారు. భారీ మొత్తంలో తెచ్చిన అప్పులు ద్వారా ప్రభుత్వ పథకాలకంటే పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలకు పెద్ద ఎత్తున రాయితీలు ఇచ్చేందుకు దోహదపడుతున్నట్లు దునుమాడారు. కాగా సూపర్ సిక్స్ హామీల్లో బాబు గ్యారంటీ పథకం ద్వారా ప్రతి మహిళకు రూ1500 గురించి, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ వంటి పథకాల అమలుకు బడ్జెట్ లో ప్రస్తావన లేకపోవడం ఆయా వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు తెలిపారు. స్త్రీ శక్తి ( ఉచితబస్సు) కి తప్ప మహిళా మణుల ఆకాంక్షలు తీరెందుకు బడ్జెట్ ఏ మాత్రం తోడ్పడదన్నారు. గ్రామీణ ఉపాధికి దోహదపడే విబిఆర్ ఏఎంజి పథకం,పరిశ్రమల అభివృద్ధికి నామ మాత్రం నిధులు కేటాయించారన్నారు. కాగా 60నుంచి 70శాతం ఆధారపడి జీవించే రైతాంగానికి జలవనరుల అభివృద్ధికి కూడా నామమాత్రంగా కేటాయించినట్లు దుయ్య బట్టారు. ప్రకాశం, మార్కాపురం, వంటి వెనుకబడిన జిల్లాల ప్రజలకలఅయిన వెలుగొండ ప్రాజెక్టు కనీసం రూ 2 వేలకోట్లు కేటాయించవలసి ఉండగా కేవలం రూ 110 కోట్ల కేటాయించి ప్రజల ఆశలు పై నీళ్లు చల్లినట్లు తీవ్ర విమర్శలు చేశారు. జిల్లాలో గుండ్లకమ్మ, పాలేరు వంటి ప్రాజెక్టు లు పల్నాడు జిల్లా వరికపూడిశల వంటి ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా వ్యవసాయం అభివృద్ధి చెందడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, ప్రజల ఆదాయం పెరిగేందుకు దోహద పడుతుందని విశ్లేషించారు. కాగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ధరల స్థిరీకరణ చేయడం, దానికి తగిన విధంగా బడ్జెట్ కేటాయించడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకునే వీలుంటుందని స్పష్టం చేసారు. ప్రభుత్వం ఆ దిశగా ప్రజల ఆకాంక్షల కనుగుణంగా ప్రజలకు ఆదాయం చేకూర్చే రీతిలో బడ్జెట్ రూపొందించాలి తప్ప ప్రజలపై రూ 70వేల కోట్ల భారం మోపితే ఏ మాత్రం సహించరని హితవు పలికారు. ప్రభుత్వం ప్రజల అసంతృప్తులకు గురి కాకుండా ప్రజామోదంగా బడ్జెట్ రూపొందించాలని సూచించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు,సయ్యద్ హనీఫ్, జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు,ఎం రమేష్, డి సోమయ్య పాల్గొన్నారు.

## పేకాట శిబిరం పై పోలీసుల మెరుపు దాడి



**పామూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

పట్టణంలోని అంకాలమ్మ వీధి సమీపంలో చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ ఐ. కే .అనుక్ పోలీస్ సిబ్బంది శనివారం మెరుపు దాడులు నిర్వహించి ఏడు గురుని పేకాటరాయుళ్ల ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 45,150/- రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కే అనూక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా జూదం పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ. కే. అనూక్ హెచ్చరించారు.

## నియోజకవర్గ ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన - ఎమ్మెల్యే డా. ఉగ్ర

**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి14**



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం సర్వ ప్రజలకు మహాశివరాత్రి శు భాకాంక్షలు తెలిపిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్. ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి. అజ్ఞానాం ధకారాన్ని తొలగించే జ్యోతి శివుడు. మనసుకు శాంతి జీవితానికి దిశ ప్రసాదించే దైవం శివుడు. భోళేశంకరుని కృపాకటాక్షాలు ప్రతి కుటుంబాలపై ఎల్లప్పుడూ నిలిచి, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో మీ జీవితం నిండిపోవాలని మనస్ఫూర్తిగా ఆ పరమేశ్వరుడు ఆశీర్వాదం మీ పైన ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే డా.ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కోరారు.

## నారాయణస్వామి దేవస్థానంలో వైభవంగా శేష వాహనసేవ, గ్రామోత్సవం, హోమాలు

**ఉభయ దాతలు జిల్లెల్ల ఆదినారాయణ సన్స్ మరియు బ్రదర్స్**





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 14**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమాలకు కోవిలంపాడు గ్రామానికి చెందిన జిల్లెల్ల ఆదినారాయణ అండ్ సన్స్, జిల్లెల్ల బ్రదర్స్ ఉభయ దాతలు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పారాయణం, మహా సుదర్శన హోమములు, నవగ్రహ సుదర్శన హోమాలు, దీక్ష హోమములు, లము పూర్ణహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ మంత్రోచ్చారణలతో హోమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శేష వాహనసేవ వైభవంగా జరిగింది. అనంతరం గ్రామోత్సవంగా స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు నారాయణస్వామి నామ స్మరణతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో శేషారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్, నన్నసాని ప్రసాద్ ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com